## బోధన్, అర్బన్ ఆశీర్వాద సభల హైలైట్స్..

నిజామాబాద్ స్పోర్ట్స్/శక్కర్‌నగర్, నవంబర్ 15: బోధన్‌తోపాటు నిజామాబాద్ నగరంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలకు అశేష జనవాహిని తరలివచ్చింది. కళాకారుల బృందం ఆటాపాటలు ఆలోచింపజేశాయి. నగరంలోని సభలో కేసీఆర్, కేటీఆర్, కవిత కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు 'గులాబీల జెండలమ్మా..' పాటకు డ్యాన్సులతో సందడి చేశారు.

**1.20 గంటలకు** : హెలికాప్టర్‌లో బోధన్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్.. ప్రత్యేక బస్సులో సభా వేదికపైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. ఆయనకు బోధన్ ఎమ్మెల్యే షకీల్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పూదోట రవికిరణ్ స్వాగతం పలికారు.

**1.30:** ఎమ్మెల్యే షకీల్ ప్రసంగం అనంతరం సీఎం కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

**1.59:** తెలుగు, ఉర్దూలో 29 నిమిషాలపాటు మాట్లాడిన ముఖ్యమంత్రి.. తన ప్రసంగాన్ని ముగించారు. అనంతరం హెలికాప్టర్‌లో నిజామాబాద్ అర్బన్ సభకు బయల్దేరి వెళ్లారు.

**1.40:** ప్లకార్డులు, గులాబీ జెండాలు, కండువాలతో వచ్చిన జనంతో నిజామాబాద్ అర్బన్ ఆశీర్వాద సభ పూర్తిగా నిండిపోయింది.

**2.14:** హెలికాప్టర్ ద్వారా సీఎం కేసీఆర్ హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు.

**2.18:** సీఎం కేసీఆర్‌కు అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మహేశ్ బిగాల తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం బస్సులో సభా ప్రాంగణానికి బయలుదేరారు.

**2.20:** సభా వేదిక వద్దకు గులాబీ బాస్ కేసీఆర్ చేరుకున్నారు.

**2.23:** ప్రజలకు సీఎం కేసీఆర్ అభివాదం చేయడంతో జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

**2.24:** వేదికపై అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడారు.

**2.28:** ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు. ముస్లింలకు కూడా అర్థమయ్యేలా ఉర్దూలోనూ మాట్లాడారు.

**2.56:** జై తెలంగాణ నినాదంతో బీఆర్ఎస్ అధినేత తన ప్రసంగాన్ని ముగించగా, మొత్తం 28 నిమిషాలు వేదికపై మాట్లాడారు.

**3.02:** హెలికాప్టర్‌లో ఎల్లారెడ్డి సభకు బయల్దేరారు.

# రాష్ట్రమంతటా పింక్ వేవ్..

- బీఆర్ఎస్ అంటే ఆత్మీయత.. కాంగ్రెస్ అంటే అహంకారం
- సీఎం కేసీఆర్ అంటే అభివృద్ధికి గుర్తు.. ప్రేమకు పరాకాష్ట
- ఆయను ఓడించడం కాంగ్రెస్, బీజేపీతో అయ్యే పనికాదు
- షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి
- బోధన్ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


బోధన్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బోధన్, నవంబర్ 15: రాష్ట్రమంతటా బలంగా పింక్ వేవ్ కనిపిస్తున్నదని, మూడోసారి సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చి దక్షిణాదిన తొలిసారి హ్యాట్రిక్ సీఎంగా రికార్డు సృష్టిస్తారని శాసనమండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. ప్రజలు గర్వంగా కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్న ఆశతో ఉన్నారని తెలిపారు. 'సీఎం కేసీఆర్ అంటే అభివృద్ధికి గుర్తు.. కేసీఆర్ అంటే ప్రేమకు పరాకాష్ట' అని ఆమె వ్యాఖ్యానించారు. గులాబీ జెండా ఎత్తి తెలంగాణ ఉద్యమానికి బయల్దేరినప్పుడు ఇదే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. అందరూ పిడికిలెత్తి ఉద్యమం చేస్తున్నప్పుడు.. ప్రస్తుత పీసీపీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బందూకు పట్టుకొని ప్రజల మీదకు వచ్చిన విషయాన్ని ప్రజలు మర్చిపోతారా అని అడిగారు. రైతుబంధును అన్నదాతలకు బిచ్చమేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, పింఛన్లు, రైతుబీమా వృథాగా ఇస్తున్నారని కూడా అంటున్నారని మండిపడ్డారు. అధికారంలో లేనప్పుడే ఇంత అహంకారంతో మాట్లాడుతున్న కాంగ్రెస్.. రేపు పొరపాటున అధికారంలోకి వస్తే,.. ప్రజల్ని కనీసం పట్టించుకుంటారా.. అన్న విషయాన్ని ఆలోచించాలని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ అంటే ఆత్మీయత అని, కాంగ్రెస్ పార్టీ అంటే అహంకారమని కవిత అన్నారు.

గ్రామాల్లో తెలంగాణ అభివృద్ధిపై ప్రజలు చర్చించాలని కోరారు. ఉమ్మడి పాలనలో ఒక్క ప్రభుత్వమైనా రైతులకు నయా పైసా ఇచ్చిందా అని ఆలోచించాలన్నారు. లక్షలాది పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని, గతంలో ఎవరైనా ఈ ఆలోచన చేశారా అని అడిగారు. ఏమీచేయని, ఎందుకూ పనికిరానివాళ్లు, చుక్క నీటిబొట్టును కూడా ఇవ్వనివాళ్లు.. ఇవాళ సీఎం కేసీఆర్ మీద తొడ కొడతాం.. మెడ కోసుకుంటాం.. అని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తొడగొడితేనో, మెడ కోసుకుంటేనో సీఎం కేసీఆర్‌మీద గెలవడం.. వారితో అయ్యే పనికాదని తేల్చిచెప్పారు. సీఎం కేసీఆర్ మీద గెలవాలంటే, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల గుండెల్లో చోటు సంపాదించాలి తప్ప వట్టిగానే అయ్యే పనికాదని స్పష్టంచేశారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి సాగునీటిశాఖ మంత్రిగా పనిచేసినా ఒక్క చెరువును కూడా మరమ్మతు చేయలేదని కవిత విమర్శించారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఎమ్మెల్యే షకీల్.. నిజాంసాగర్ కాల్వల ఆధునీకరణకు కృషిచేశారని, ఎన్నో చెరువులను బాగుచేసుకున్నామని, చివరి ఆయకట్టుకు కూడా నీళ్లు వచ్చేలా పనులు చేసుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్‌ను మరోసా భారీ మెజారిటీతో గెలిపించి, సీఎం కేసీఆర్‌కు బోధన్ నియోజకవర్గాన్ని బహుమతిగా ఇద్దామని ఓటర్లకు కవిత పిలుపునిచ్చారు.

## నగరం అప్పుడెట్లుండె..
# ఇప్పుడెట్లుంది

- పనితీరును చూసి ప్రజలు ఆదరించాలి
- అభివృద్ధికి సహకరించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు
- కటాఫ్ తేదీ లేకుండా బీడీ పింఛన్లు ఇస్తాం
- బీఆర్ఎస్ అభ్యర్థి, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 15: కటాఫ్ డేట్ లేకుండా కొత్తగా వచ్చిన బీడీ కార్మికులందరికీ పింఛన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను కోరానని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా తెలిపారు. నిజామాబాద్‌కు అత్యధిక నిధులు మంజూరుచేసి నగర అభివృద్ధికి సహకరించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యావాదలు తెలిపారు. బుధవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో బిగాల మాట్లాడారు. అర్బన్ నియోజక వర్గంలో చాలా మంది మహిళలు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 2014 తర్వాత కొత్తగా వచ్చిన కార్మికులకు కూడా పింఛన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు నిజామాబాద్ నగరం ఎట్లుండెనో.. ఈ పదేండ్లలో ఎంత అభివృద్ధి చెందింతో ప్రజలు గుర్తించాలని సూచించారు. ఎల్లమ్మగుట్ట రైల్వేకమాన్ నగర ప్రజలు ఏండ్లుగా ఎదుర్కొంటున్న వర్షపు నీళ్లు, ట్రాఫిక్‌జామ్ సమస్యలను శాశ్వతంగా పరిష్క రించేందుకు కొట్లాడి రూ. 20 కోట్లతో బ్రిడ్జి కట్టించామన్నారు. పాత కలెక్టరేట్, కొత్త కలెక్టర్ ఆఫీస్‌కు తేడాను గమనించాలన్నారు. మంత్రి కేటీఆర్‌తోపాటు తన సోదరుడు మహేశ్ బిగాల సహకారంతో నగరానికి ఐటీహబ్ తీసుకువచ్చానని తెలిపారు. ఇటీవల నగరంలో పర్యటించిన సీఎం కేసీఆర్.. పలు అభివృద్ధి పనుల కోసం రూ. 100కోట్లు మంజూరు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. రూ. 56 కోట్లతో నిజామాబాద్ షాన్‌కు తగినట్లుగా ఇందూరు కళాభారతిని నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు నగర అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు, వ్యాపారుల సౌకర్యార్థం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు కూడా కట్టాలన్న ఆలోచన చేయలేదన్నారు. ఎక్కడెక్కడ మంచి ఎమ్మెల్యేలు ఉన్నారో అక్కడ ప్రభుత్వ కార్యక్రమాలు బాగా అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ సాధన, ప్రజల ఆత్మగౌరం, హక్కుల కోసమని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించినా ఎలాంటి అభివృద్ధీ చేపట్టలేదని, బీజేపీ ఏం చేసిందో.. వారి చరిత్ర కూడా ప్రజలకు తెలుసని అన్నారు. ప్రజలు ఓట్లు వేసేటప్పుడు అభ్యర్థుల గుణగణాలు, వారికున్న గౌరవం, అభివృద్ధిపై ఉన్న శ్రద్ధను తప్పకుండా చూడాలని కోరారు. ప్రధానంగా అభ్యర్థుల వెనుక ఉన్న పార్టీల చరిత్ర, నడవడిక, వారి పార్టీలకు అధికారం కట్టబెట్టినప్పుడు ఏం చేశాయో ఒకసారి ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కొత్తవారికి పింఛన్లు ఇస్తామని తెలిపారు. ఆసరా పింఛన్లను రూ. 5వేలకు పెంచనున్నట్లు చెప్పారు. పదేండ్లలో ఎలాంటి గొడవలూ లేకుండా నగరం ప్రశాంతంగా ఉందని తెలిపారు. ఇదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలపించాలని కోరారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాంకిషన్‌రావు, మేయర్ నీతూకిరణ్, ధర్పల్లి రాజేశ్వర్, వీజీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ఆశీర్వాదంతో అభివృద్ధి

- మరోసారి దీవించి గెలిపించండి..
- బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్


బోధన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్

బోధన్, నవంబర్ 15: సీఎం కేసీఆర్ ఆశీర్వదంతో బోధన్ నియోజకవర్గాన్ని తొమ్మినరేండ్లలోనే రూ.3వేల 500 కోట్లతో అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ తెలిపారు. పట్టణ శివారులోని అంబెం గేట్ వద్ద బుధవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు రూ. 2వేల కోట్లు జమయ్యాయని తెలిపారు. దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే సాధ్యమయ్యిందని తెలిపారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని షకీల్ కోరారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. బోధన్ నియోజకవర్గానికి జేఎన్‌టీయూ కళాశాల, బీఫార్మసీ కాలేజీని మంజూరుచేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. అలాగే, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత.. అధికారంలోకి రాగానే బోధన్ నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఇవ్వాలని సీఎంకు విన్నవించారు. ఆశీర్వాద సభలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రైతు నాయకుడు కోటపాటి నరసింహ నాయుడు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌రావు, మహారాష్ట్ర బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్ కదం, నాయకుడు శంకరన్న దోంగ్లే, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరావు దేశాయ్, ఎంపీపీ బుద్దె సావిత్రీరాజేశ్వర్, జాగృతి నాయకుడు అవంతిరావు, బీఆర్ఎస్ నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, రవీందర్ యాదవ్, గోగినేని నరేంద్రబాబు, సంజీవ్‌కుమార్, డి.శ్రీరామ్, భూంరెడ్డి, నర్సింగ్‌రావు, సాలూరా షకీల్, బుద్దె రాజేశ్వర్, రజాక్, మహమూద్, అబ్దుల్ వాసే తదితరులు పాల్గొన్నారు.